మహేశ్వరంలోని కోళ్ల పడకల్‌లో మత్తడి దుంకుతున్న చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో శైలజా రెడ్డి

కందుకూరు, జైత్వారంలో మత్తడి దూకుతున్న సందమ్మ చెర్వు

నీటిలో నుంచి దాటుతున్న గ్రామస్తులు

ఎడతెరిపి లేకుండా వాన..

- రోడ్లపై ప్రవహిస్తున్న వరదనీరు..
- లోతట్టు ప్రాంతాలు జలమయం..
- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- సహాయక చర్యలు చేపట్టిన అధికారులు, సిబ్బంది
- మత్తడి దుంకుతున్న చెరువులు, కుంటలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో రెండు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జన జీవనం అతలాకుతలం అయింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. రోడ్లపై వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నాయి. అధికారులు, సిబ్బంది ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సహాయక చర్యలు చేపట్టారు.

ఎల్బీనగర్ నియోజకవర్గంలో..

ఎల్బీనగర్, సెప్టెంబర్ 1 : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జల మయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులతో పాటుగా ఇంటర్నల్ రహదారులు నీటితో నిండిపోయాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వారు హెచ్చరిస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. చైతన్యపురి, కొత్తపేట, గడ్డిఅన్నారం, లింగోజిగూడ, నాగోలు, మన్సూరాబాద్, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరుచేరి పలు నివాసాలు మునిగిపోయాయి. సమాచారం అందుకున్న అధికారులు, స్థానిక కార్పొరేటర్లు, స్పందించి ఆయా ప్రాంతాల్లో వరదనీరు వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. బయటకు రాకపోకలు లేకుండా నివాసాలకే పరిమితం అవుతున్నారు. ఎమర్జెన్సీ టీంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలకు కందుకూరు మండలంలోని చెరువులు, కుంటలు నిండి మత్తడి దూకుతున్నాయి. ఎక్కడ చూసినా చెరువులు నిండుకుండాల కనిపిస్తున్నాయి. ఈ సంవత్సరం ఇదే భారీ వర్షం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు, కొత్తగూడ, మీర్‌ఖాన్‌పేట్, ఆకుల మైలారం, సాయిరెడ్డిగూడ, జైత్వార, గ్రామాల చెరువులతో పాటు చిన్న చెరువులు, కుంటలు నిండుతున్నాయి.

మహేశ్వరం నియోజకవర్గంలో..

మహేశ్వరం , సెప్టెంబర్1: మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా నిరవధికంగా కురుస్తున్న వర్షాలకు చెరువులు ,కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. కొన్ని చెరువులు మత్తడి దూకుతున్నాయి. చెరువులలోకి వరద నీరు భారీగా చేరడంతో స్థానికులు సంతోషపడుతున్నారు. చెరువులను చూడటానికి స్థానికులు పెద్ద ఎత్తున చెరువుల వద్దకు చేరుకొని నీటిలో నిలబడి సంతోష పడుతున్నారు. మండల ఎంపీడీవో శైలజా రెడ్డి చెరువులను సందర్శించారు. కోళ్ల పడకల్ చెరువు ను ఆమె పరిశీలించారు. పాత ఇండ్లను పరిశీలించి.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బడంగ్‌పేట, మీర్‌పేట, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలో కమిషనర్లు జ్ఞానేశ్వర్, వాణి రెడ్డి, వెంకట్రామ్, రఘుకుమార్‌లు పర్యటించారు. రోడ్లకు అడ్డంగా పడిన చెట్లను, విద్యుత్ స్తంభాలను తొలగించారు. జేసీబీల ద్వార వరద కాల్వలను తీయించారు. వరద నీరు సజావుగా పోవడానికి మ్యాన్‌హోళ్లను క్లీన్ చేయించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్లు సూచించారు. అవసరం అయితే తప్ప బయటకు రావద్దు అన్నారు.

సైదాబాద్, అక్బర్‌బాగ్, ఐఎస్ సదన్ డివిజన్ల పరిధిలో

సైదాబాద్, సెప్టెంబర్ 1 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. సైదాబాద్, అక్బర్ బాగ్, ఐఎస్ సదన్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో వరదనీరు రోడ్లపై నిలిచాయి. లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోవడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది మ్యాన్‌హోళ్ల మూతలు ఎత్తి వరదనీరు పోయేవిధంగా చర్యలు చేపట్టారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్ కరణ్‌బాగ్ మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో భారీ వృక్షం విరిగిపడింది. అదే విధంగా వివిధ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు, వృక్షాలు పడిపోయాయి. సింగరేణి కాలనీ, సన్‌సైన్ కాలనీ, శంకేశ్వరబజార్, చింతల్, పల్టన్, పిల్లిగుడిసెలు, సాయిరాంబస్తీ ,తదితర ప్రాంతాల్లో వరదనీరు రోడ్లపై నిలిచి పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అప్రమత్తం అవసరం..

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమ యం అవుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైతే తప్ప బయటకు రావద్దు. అన్ని జాగ్రత్తలు పాటించాలి. వరదలతో ప్రమాద కరంగా ఉంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. కరెంట్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, చెరువులు, కుంటలు ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి .

– సుధీర్‌రెడ్డి , ఎల్బీనగర్ ఎమ్మెల్యే

జాగ్రత్తగా ఉండాలి..

వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వండి. ఎల్బీనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలంతా వర్షాల నేపథ్యంలో అవసరం అయితే తప్ప బయటకు రావద్దు. ప్రజలు తక్షణం జాగ్రత్తలు పాటించండి. లోతట్టు ప్రాం తాల్లో జీహెచ్ఎంసీ బృందాలు సహా యం చేస్తున్నాయి.

– మల్‌రెడ్డి రాంరెడ్డి, తెలంగాణ రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్

అల్మాస్‌గూడ వైస్‌ఆర్‌కాలనీలో రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

చైతన్యపురి డివిజన్‌లో డ్రైనేజీను క్లియర్ చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బడంగ్‌పేటలో వదరనీరు పోవడానికి జేసీబీ ద్వార కాల్వను తీయిస్తున్న దృశ్యం

అస్మాన్ ఘడ్ మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో విరిగిన చెట్టు

ఆర్‌డీఓ సూరజ్ కుమార్‌కు సన్మానం



ఆర్డీఓ సూరజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అనంతరెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది

కందుకూరు, సెప్టెంబర్ 1 : కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ వీడ్కోలు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్‌డీఓ అనంతరెడ్డి, డివిజన్ పరిధిలోని కందుకూరు, సరూర్‌నగర్, బాలాపూర్, మహేశ్వరం, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు తాసీల్దార్లు, సిబ్బంది ఆయనను శాలువాలు, పూలదండలతో సన్మానించి.. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్లు గోపాల్, ఆర్‌పీ జ్యోతి, అనిల్, క్రిష్ణ, గౌతమ్, జ్యోతి, చెన్నారెడ్డి, నాయబ్ తాసీల్దార్లు రాజు, తాజుద్దీన్, ఊటు యశ్వంత్, ఆర్‌డీఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

లింగోజిగూడ డివిజన్‌లో పర్యటించి.. మాట్లాడుతున్న కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

చంపాపేట, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గత రెండు రోజులుగా ఎడతెర్పి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా డివిజన్ పరిధిలోని శాతావాహననగర్, మైత్రీనగర్, అల్తాఫ్‌నగర్, ధర్మపురి కాలనీ, సాయినగర్, జనప్రియ అపార్ట్‌మెంట్, వడ్డెరబస్తీ, తపోవన్ కాలనీ, లోతట్టు ప్రాంతాల్లో స్థానికులతో కలిసి ఆదివారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా ఆయా కాలనీలు, బస్తీల్లోని డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిండి వీధులగుండా పారుతున్నాయి. దీంతో సిబ్బందితో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించినట్లు తెలిపారు. ప్రజలు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నరేశ్, కాలనీ వాసులు శ్రీపతిరావు, రాజు, రవికుమార్, జగదీశ్వర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో వీహెచ్‌పీ జిల్లా ప్రతినిధులు

ఎల్బీనగర్, సెప్టెంబర్ 1 : విశ్వ హిందూ పరిషత్ వివేకానందనగర్ జిల్లా ఆత్మీయ సమ్మేళనాన్ని సరూర్ నగర్ చెరువు కట్టపైన భవానీ శంకర్ ఆలయంలో నిర్వహించారు. వివేకానందనగర్ ప్రఖండ అధ్యక్షుడు కళ్లెం మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి కీర్తిగారి అనంతాచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా చిలుకూరి రాంరెడ్డి, వనపర్తి రమేశ్, గణపురం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాంత సంస్కార శిక్షణ ప్రముఖ్ మల్లికార్జున్‌లు పా ల్గొన్నారు. వీహెచ్‌పీ బలోపేతం, కార్యక్రమాలు, సంఘం బలోపేతం కోసం ఆత్మీయ సమ్మేళనంలో వివరించారు. హిందూ ధర్మ ప్రచారంతోపాటు అందరిలో దేశభక్తి, దైవభక్తిని పెంపొందించే కార్యక్రమాలను రూపొందించి ముందుకు సాగాలని అన్నారు.

చెట్టుకూలి విద్యుత్ తీగలపై..

విరిగిన స్తంభాలు..

తప్పిన పెను ప్రమాదం

సరస్వతీనగర్ కాలనీలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చంపాపేట, సెప్టెంబర్ 1: భారీ వర్షాలకు చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడి.. స్తంభాలు నేలకూలాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం చంపాపేట డివిజన్, కర్మన్‌ఘాట్ సరస్వతీ నగర్ కాలనీలో వర్షానికి చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా నేల కూలడంతో విద్యుత్ వైర్లు మండి పొగలు వ్యాపించాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి.. సంబంధిత విద్యుత్ అధికారులను, జీహెచ్ఎంసీ అధికారులను రప్పించి.. విరిగిన చెట్టును అక్కడి నుంచి తొలగించారు. అనంతరం విద్యుత్ అధికారులు విరిగిన విద్యుత్ స్తంభాలను అక్కడి నుంచి తొలగించి.. నూతన స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్ గౌడ్, గూడూరు అవినాశ్‌రెడ్డి, కోయిలకొండ సందీప్, వేణుగౌడ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సాహచర్య బంధం పుస్తకాల ఆవిష్కరణ

రవీంద్రభారతి,సెప్టెంబర్ 1: తెలంగాణ భాషా సాంస్కృతిక, మనస్సున మనసై షేస్బుక్ సమూహపు ఆధ్వర్యంలో దివంగత రచయిత్రి పద్మా దాశరథి రెండు పుస్తకాలు, పద్మా దాశరథి రచనలు మనస్సు ముచ్చట్లు, సాహచర్య బంధం (జంట నవలలు) ఆవిష్కరణ సభ రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి , రచయిత ప్రభాకర్‌జైని, , సుబ్బారావు, డాక్టర్ మామిడి హరికృష్ణలు పుస్తకాలను ఆవిష్కరించారు.

వైభవంగా బోనాలు

కందుకూరు మండలం, దాసర్లపల్లి, అన్నోజిగూడ, రాచులూరు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దాసర్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఇందిరమ్మ దేవేందర్, మాజీ సర్పంచ్ బాలమణి, అశోక్, తదితరులు పూజలు చేశారు.

– కందుకూరు

తెలుగు భాషా నిలయాన్ని పరిరక్షించుకోవాలి

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 1: తెలుగు భాషా సంస్కృతులు, గ్రంథాలయాలకు స్ఫూర్తిగా నిలిచిన శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని వక్తలు గుర్తుచేశారు. సుల్తాన్‌బజార్‌లో గల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో భాషా నిలయం వ్యవస్థాపకురాలు రావిచెట్టు లక్ష్మీనర్సమ్మ స్మారక పురస్కారాన్ని ఆదివారం సాయంత్రం ప్రముఖ రచయిత్రి రమా మేల్కొటకు ప్రదానం చేసి సత్కరించారు. భాషా నిలయం వ్యవస్థాపదినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ కె.వి రమణాచారి పాల్గొని ప్రసంగించారు. భాషా నిలయం ఉపాధ్యక్షులు డాక్టర్ కె. చంద్రప్రకాశ్‌రావు, గౌరవ కార్యదర్శి టి. ఉడయవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళోజీ పురస్కార గ్రహీత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో కవులు డాక్టర్ ఫణీంద్ర, నాశేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, తుమ్మూరి రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడారంగంలోనూ రాణించాలి

నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవికి అందజేస్తున్న నోసా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జగదీశ్వర్, సహదేవ్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 1 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలోనూ రాణించాలని నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో పాల్గొంటున్న నాగోల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం (నోసా) ఆధ్వర్యంలో క్రీడా దుస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీ దేవి మాట్లాడుతూ.. నాగోల్ పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధితో పాటుగా విద్యార్థులు క్రీడారంగంలోనూ ముందడుగు వేసేలా ప్రోత్సహిస్తున్నారని అన్నారు. పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో సత్తా చాటి పాఠశాలకు పేరు తేవాలన్నారు. నోసా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ.. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం 1996 నుండి పూర్వ విద్యార్థులు సంఘంగా ఏర్పడి నిరంతరం కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పాఠశాలలో జరిగే క్రీడా పోటీలకు తమ వంతుగా సహకారం అందిస్తున్నామన్నారు. తాము చేస్తున్న కార్యక్ర మాల్లో భాగంగా నోసా జూనియర్ టీం 2002-03 బ్యాచ్ విద్యార్థులు కూడా ముందుకు వచ్చారని వారికి అభినందనలు తెలిపారు. శనివారం జరగాల్సిన కబడ్డీ పోటీలు వర్షాల నేపథ్యంలో వాయిదా పడ్డాయని, ఈ పోటీలను త్వరలో నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు విమల, వెంకటే శ్, నోసా జూనియర్ టీం ప్రతినిధులు జగదీశ్వర్, సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవిష్యత్ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

ఎమ్మెల్సీ కోదండరామ్

గేట్ మాస్టర్స్ అకాడమీ సక్సెస్ మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరామ్

ఆర్కేపురం, సెప్టెంబర్ 1 : తెలంగాణ భవిష్యత్ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ గేట్ మాస్టర్స్ అకాడమీ సక్సెస్‌మీట్ కొత్తపేటలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కోదండరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాయితీ, నిబద్ధతతో కూడిన ఉద్యోగం చేస్తే అందరు మీకు సలాం చేస్తారని, అలా కాకపోతే మీరు అందరికి సలాం చేస్తూ తల దాచుకోవాల్సి వస్తుందన్నారు. తప్పు అని తెలిసి కూడా తప్పులు చేస్తే తిప్పలు తప్పవన్నారు. గేట్ మాస్టర్స్ అకాడమీలో కోచింగ్ తీసుకొని గెజిటెడ్ ఆఫీసర్స్‌గా ఎన్నికైన 509 మందికి అభినందనలు తెలిపారు. స్టేట్ ఫస్ట్‌ర్యాంకు సాధించిన బి.వెంకట్‌రెడ్డికి బహుమతి ప్రదానం చేశారు. గేట్ మాస్టర్ అకాడమీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ అకాడమీలో శిక్షణ తీసుకొని 509 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన డిప్యూటీ ఎక్స్‌క్యూటివ్ ఇంజినీర్లు , తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కాచిగూడ, సెప్టెంబర్ 1: పార్లమెంట్‌లో పాసైన మహిళా బిల్లులో జనాభా ప్రకారం కేంద్ర ప్ర భుత్వం బీసీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, ఉపకోటా కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మట్టా జయంతిగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని ఓ హోటల్‌లో వివిధ సంఘాల బీసీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణ య్య హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జనాభా దామాష ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని,అందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో మహిళలకు ఎంత శాతం రిజర్వేషన్లు ఇస్తున్నదో చెప్పాలన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలిగా మట్టా జయంతిని నియమిస్తూ,నియామక పత్రాన్ని ఆమెకు అందజేశారు.

బ్రాహ్మణ గురువర్యులకు సత్కారం

ఉప్పల్, సెప్టెంబర్ 1: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్‌లోని శ్రీసాయి త్రిశక్తి పీఠం ఆలయంలో ఓం శ్రీ గురుబ్యో నమః వేడు క వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ కుప్పా శ్రీనివాసశాస్త్రీ హాజరై ప్రసంగించారు. అన్నిరంగాలలోని ప్రముఖులను గుర్తించి, గౌరవించడం అభినందనీయమన్నారు. బ్రాహ్మణులు నిత్య విద్యార్థిలా శ్రమపడుతూ సమాజంలో వస్తున్న మార్పులను తెలుసుకుంటూ, రాబోయో తరానికి తెలియ చేయడం గొప్పవిషయమన్నారు. సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి బాల శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ వేడుక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బ్రాహ్మణ గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిర్లమందిర్ ప్రధాన అర్చకులు లక్ష్మీనర్సింహాచార్యులు, రాపాక వెంకట ప్రభాకర్, విద్యాదాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఉపాధ్యక్షులు కిషన్‌రావు, రణదీప్‌శర్మ, వేణుగోపాలశర్మ, నాగవెంకటరాంకుమార్ పాల్గొన్నారు.